## 'మిస్' బిహేవ్ చేసింది ఆ ఇద్దరేనా?

> మొదటిపేజీ తరువాయి...

పేర్లు బయటికి పొక్కకుండా పెద్దలు అడ్డం పడుతున్నట్టు తెలిసింది. ఆ రోజు ఏమీ జరగలేదని ప్రభుత్వ పెద్దలు బుకాయిస్తున్నప్పటికీ, విందుకు అతిథులుగా వచ్చిన ఆ ఇద్దరు నేతలు మ్యాగీతో అనుచితంగా ప్రవర్తించినట్టు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయినట్టు తెలిసింది. మిస్ ఇంగ్లండ్ ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపడంతో రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులతో అంతర్గత విచారణకు ఆదేశించింది. చౌమహల్లా ప్యాలెస్ విందులో మిస్ ఇంగ్లండ్ కూర్చున్న టేబుల్ వద్ద ఏం జరిగిందనే అంశంపైనే ప్రధానంగా దృష్టి సారించి మూడు రోజుల పాటు విచారించిన అధికారుల బృందం ఇద్దరు వ్యక్తులను అనుమానించినట్టు సమాచారం. సీసీ ఫుటేజ్‌లలో వారి వెకిలి చేష్టలను స్పష్టంగా గుర్తించినట్టు, అదే అంశాన్ని ప్రాథమిక నివేదికలో పొందుపరచి ప్రభుత్వానికి అందించినట్టు తెలిసింది. ఈ ఇద్దరు నేతలు కూడా 40 ఏండ్లలోపు వారేనని, వారిలో ఒకరు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న నేత కాగా, మరొకరు ముఖ్యనేత నిత్యం పేరుపెట్టి పిలిచేటంత సాన్నిహిత్యం ఉన్న కార్పొరేషన్ నేతగా విచారణ కమిటీ గుర్తించినట్టు ప్రచారం జరుగుతున్నది. చౌమహల్లా విందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌లు మొత్తం బయటపెడితేనే పూర్తి వివరాలు బయటకు వస్తాయని, కాబట్టి దానిని బయటపెట్టాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### మీడియాపై మిస్ వరల్డ్ బాధ్యతల అధికారి ఫ్రస్ట్రేషన్

తెలంగాణ ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్ బాధ్యతలు నిర్వహిస్తున్న అత్యున్నతాధికారి మీడియాపై తన ఫ్రస్ట్రేషన్ ప్రదర్శించారు. సచివాలయం జర్నలిస్టులపై బూతులు ప్రయోగించారు. ఆయన నోటి దురుసుతనంపై మీడియా ప్రతినిధులు విస్మయం వ్యక్తంచేశారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణల నేపథ్యంలో వేసిన విచారణ కమిటీ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించినట్టు బయటికి వచ్చింది. దీంతో మీడియా ప్రతినిధులు సదరు ఉన్నతాధికారి నుంచి వివరణ కోరే ప్రయత్నం చేయగా.. ఆయన దుర్భాషలకు దిగడంతో జర్నలిస్టులు ఆందోళన వ్యక్తంచేశారు.

## మిల్లామ్యాగీపై చర్యలు ఉండవు!

- ఆమెను ప్రశ్నించకుండానే దర్యాప్తు ముగింపు
- మిల్లామ్యాగీపై లండన్‌లో కేసు నమోదు
- పోటీదారులెవరూ వేధింపులు ఎదుర్కొనలేదు
- స్పెషల్ సెక్రటరీ జయేశ్ రంజన్ వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఎదుర్కొన్న చేదు అనుభవంపై తెలంగాణ ప్రభుత్వం విచారణ జరిపిందని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్ తెలిపారు. ఆమెపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని వివరించారు. మిస్ వరల్డ్ నిర్వాహకులు మిల్లాపై లండన్‌లో కేసు వేసినట్టు చెప్పారు. ఆమెపై యూకే ప్రభుత్వమే చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని వివరించారు. మిస్ వరల్డ్ పోటీల సమయంలో పోటీదారుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరుపై మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. ఆమె చేసిన ఆరోపణలపై వేసిన కమిటీ దర్యాప్తులో భాగంగా బాధితురాలి వివరణనూ తీసుకోవాల్సి ఉంటుంది. మిల్లా మ్యాగీ ఎదుర్కొన్న భయానక పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకొని అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ దర్యాప్తు పూర్తయిందని, 109 మంది పోటీదారులు ఎలాంటి వేధింపులనూ ఎదుర్కోలేదని కమిటీ తేల్చేసినట్టు జయేశ్‌రంజన్ ప్రకటించడం గమనార్హం. అయితే వారు పోటీలు ముగిశాక.. తమ స్వదేశాలకు వెళ్లిన తరువాత ఎలా స్పందిస్తారోననే భయం నిర్వాహకులను వెంటాడుతున్నది. ఈ దశలోనే మిస్ ఇంగ్లండ్‌పై మిస్ వరల్డ్ నిర్వాహకులు కేసు వేసేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. కాగా ఈ కేసును మిస్ ఇంగ్లాండ్ ఎలా ఎదుర్కోబోతుందో వేచి చూడాలి.

# ఆర్థిక ప్రగతి.. అధోగతి

### దేశాభివృద్ధికి గీటురాయిగా పరిగణించే జీడీపీ వృద్ధి ఢమాల్

**2024-25 ఆర్థిక సంవత్సరానికి 6.5 శాతంగానే నమోదు**

**కరోనా సంక్షోభం తర్వాత ఈ స్థాయిలో దిగజారడం తొలిసారి**

**పడకేసిన తయారీ రంగం.. నీరసించిపోయిన మైనింగ్**

**రియల్ ఎస్టేట్ ఢమాల్.. సేవా రంగంలో ఆవరించిన నిస్తేజం**

**కేంద్ర ప్రభుత్వ అధికారిక ఎన్ఎస్‌వో గణాంకాల్లో వెల్లడి**

- జపాన్‌ను దాటేసి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామన్నారు.
- 4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అంటూ ఊదరగొట్టారు.
- 11 ఏండ్లపాలనలో మా అభివృద్ధిని చూశారా? అంటూ జబ్బలు చరుచుకొన్నారు.
- అయితే, ఎన్డీయే సర్కారు పాలనా ప్రతిభ ఏపాటిదో అసలు బండారం బయటపడింది.
- 'మేకిన్ ఇండియా'ను 'జోకిన్ ఇండియా'గా మార్చిన వైనమేంటో తేటతెల్లమైంది.
- ఫలితం.. దేశ ఆర్థికాభివృద్ధికి అద్దంపట్టే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు నాలుగేండ్ల కనిష్ఠానికి పతనమయ్యింది.

న్యూఢిల్లీ, మే 30/(స్పెషల్ టాస్క్ బ్యూరో): తమ 11 ఏండ్ల పాలనలో దేశం ఆర్థికాభివృద్ధిలో రాకెట్ వేగంతో దూసుకుపోతున్నదంటూ బీజేపీ నాయకులు చేసుకొంటున్న ప్రచారం అంతా అబద్ధమేనని తేలిపోయింది. మేకిన్ ఇండియా ఉత్త ప్రచారమేనని, అదెప్పుడో జోకిన్ ఇండియాగా మారిందని మరోసారి రుజువైంది. అవును.. దేశంలో తయారీ రంగం ఎన్నడూ చూడని గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. సేవా రంగం కుంటుపడిపోయింది. రియల్ ఎస్టేట్ ఢమాల్ మన్నది. ట్రేడ్, ట్రాన్స్‌పోర్ట్, నిర్మాణం, ఎలక్ట్రిసిటీ, గ్యాస్, మైనింగ్ ఇలా ఒక్కటేమిటీ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా పరిగణించే అన్ని రంగాలు నేలచూపులు చూస్తున్నాయి. మొత్తంగా దేశ ఆర్థికాభివృద్ధికి అద్దంపట్టే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు కుప్పకూలిపోయింది. ఎంతలా అంటే కరోనా సంక్షోభం తర్వాత ఎన్నడూ చూడని స్థాయిలకు దిగజారిపోయింది. ఈ మేరకు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) శుక్రవారం వెలువరించిన గణాంకాల్లో తేలింది.

### జీడీపీ నేలచూపులు

ఒక దేశం అభివృద్ధికి కొలమానాలు అంకెలే. ఒక దేశ ఆర్థిక పరిమాణాన్ని, ఉత్పాదకతను స్థూలంగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)గా చెప్పొచ్చు. జీడీపీ వృద్ధిరేటు బాగుంటే ఆ దేశం బాగున్నట్టు చెప్తారు. ఒకవేళ జీడీపీ వృద్ధిరేటులో మందగమనం కొనసాగితే, ఆ దేశం సమస్యలను ఎదుర్కొంటున్నట్టు లెక్క. ఇప్పుడు దేశ జీడీపీ వృద్ధిరేటును చూస్తే, అలాంటి పరిస్థితులే దాపురించినట్టు అర్థమవుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా నమోదైంది. అంటే ఏకంగా నాలుగేండ్ల కనిష్ఠానికి పతనమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే.. 9.2 శాతం నుంచి 6.5 శాతానికి దిగజారింది. అంటే ఏడాది వ్యవధిలోనే 2.7 శాతం పడిపోయింది. ఏడాది వ్యవధిలోనే జీడీపీ వృద్ధిరేటు ఈ మేర పడిపోవడం యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులకు అద్దం పడుతున్నదని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. తయారీ రంగ కార్యకలాపాల్లో నెలకొన్న నిస్తేజం, మౌలిక రంగంలో మందగమనం మొత్తంగా భారత ఆర్థిక ప్రగతిని తీవ్రంగా అడ్డుకొన్నట్టు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా దేశ జీడీపీ గణాంకాలు నిరాశాజనకంగా నమోదయినట్టు చెప్తున్నారు. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.5 శాతానికే పరిమితమైంది. ఇది నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఇక చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో జీడీపీ వృద్ధిరేటు 7.4 శాతంగానే ఉన్నట్టు ఎన్ఎస్‌వో అంచనాలు చెప్తున్నాయి. 2024-25 నామినల్ గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) రూ.300.22 లక్షల కోట్లుగా ఉంటే.. 2023-24లో రూ.274.13 లక్షల కోట్లుగా ఉన్నది.

### కీలక రంగాలన్నీ కుదేలు..

జీడీపీ పెరుగుదలకు కీలకమైన దాదాపు అన్ని రంగాలు గడిచిన ఆర్థిక సంవత్సరం నేలచూపులనే చూస్తున్నట్టు ఎన్ఎస్‌వో గణాంకాలనుబట్టి అర్థమవుతున్నది. ఏడాది వ్యవధిలోనే తయారీ రంగం వృద్ధిరేటు ఏకంగా 7.8 శాతం మేర క్షీణించింది. అంటే 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ఒక విఫల పథకంగా అర్థమవుతున్నది. జీడీపీకి కీలకమైన ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాలు కూడా వృద్ధిరేటులో 3.1 శాతం మేర క్షీణించాయి. విద్యుత్తు-గ్యాస్ వృద్ధిరేటు 2.7 శాతం, ట్రేడ్-రవాణా రంగాల వృద్ధిరేటులో 1.4 శాతం మేర తగ్గుదల నమోదైంది. నిర్మాణం, మైనింగ్ తదితర రంగాల్లో కూడా వృద్ధిరేటు ఒకటి, అర శాతం చొప్పున క్షీణించడంతో మొత్తంగా జీడీపీ వృద్ధిరేటు నిరుడితో పోలిస్తే 2.7 శాతం మేర మందగించింది.

**2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతం**

**ఏడాది వ్యవధిలో తయారీ రంగంలో క్షీణత 7.8 శాతం**

**నిరుడితో పోలిస్తే వృద్ధిరేటులో క్షీణత 2.7 శాతం**

**రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ రంగాల్లో క్షీణత 3.1 శాతం**

### జీడీపీ వృద్ధిరేటు పడిపోయిందిలా..

| ఆర్థిక సంవత్సరం | జీడీపీ వృద్ధిరేటు |
| --- | --- |
| 2021-22 | 8.7 శాతం |
| 2022-23 | 7.2 శాతం |
| 2023-24 | 9.2 శాతం |
| 2024-25 | 6.5 శాతం |

### 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు ఇలా..

త్రైమాసికాల వారీగా జీడీపీ గణాంకాలు

| త్రైమాసికం | వృద్ధిరేటు |
| --- | --- |
| ఏప్రిల్-జూన్ | 6.5% |
| జూలై-సెప్టెంబర్ | 5.6% |
| అక్టోబర్-డిసెంబర్ | 6.4% |
| జనవరి-మార్చి | 7.4% |

### ఏ రంగంలో వృద్ధిరేటు ఎంత పడిపోయిందంటే?

| రంగం పేరు | 2023-24 | 2024-25 | క్షీణత |
| --- | --- | --- | --- |
| తయారీ రంగం | 12.3 శాతం | 4.5 శాతం | 7.8 శాతం |
| రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ | 10.3 శాతం | 7.2 శాతం | 3.1 శాతం |
| విద్యుత్తు, గ్యాస్ | 8.6 శాతం | 5.9 శాతం | 2.7 శాతం |
| ట్రేడ్, రవాణా | 7.5 శాతం | 6.1 శాతం | 1.4 శాతం |
| నిర్మాణం | 10.4 శాతం | 9.4 శాతం | 1 శాతం |
| మైనింగ్ | 3.2 శాతం | 2.7 శాతం | 0.5 శాతం |

### దేశ జీడీపీ విలువ

| ఆర్థిక సంవత్సరం | విలువ |
| --- | --- |
| 2023-24 | రూ.301.23 లక్షల కోట్లు |
| 2024-25 | రూ.330.68 లక్షల కోట్లు |

## అధిక ఫీజులు వసూలు చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

### ప్రభుత్వానికి జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశం

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అధిక ఫీజుల వసూలుపై జాతీయ ఎస్టీ కమిషన్ స్పందించింది. నిర్దేశిత ఫీజుల కన్నా అధికంగా వసూలు చేసిన కాలేజీలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో అధిక ఫీజుల వసూళ్లపై కొందరు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. జేబీఐఈటీ సహా మరికొన్ని అటానమస్ కాలేజీలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవలే రాష్ట్రంలో పర్యటించిన కమిషన్, అధికారులను విచారించింది. సదరు కాలేజీలపై చర్యలు తీసుకోవాలని, బ్లాక్ లిస్టులో పెట్టాలని సర్కారుతోపాటు వర్సిటీలకు ఆదేశాలిచ్చింది. జేఎన్టీయూ రిజిస్ట్రార్ శనివారం సర్క్యులర్ జారీచేశారు. అధిక ఫీజులు వసూలుచేస్తే కాలేజీలను బ్లాక్‌లిస్టులో పెడతామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ స్కూల్స్ అండ్ టెక్నికల్ కాలేజీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ స్వాగతించారు. ఫీజులు దండుకుంటున్న కాలేజీలు ఉద్యోగులు, అధ్యాపకులకు వేతనాలివ్వడంలేదని, దీనిపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## ఎస్సీ గురుకులాల కార్యదర్శిని తొలగించాలి

### ఎంబీఎస్సీ కులాల వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యార్థులపై వివక్షాపూరిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే విధుల నుంచి తొలగించి దళిత అధికారిని నియమించాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ గురుకులను దేవాలయాలుగా ఉండాలని ఒకవైపు ప్రభుత్వం చెప్తుంటే, దళిత విద్యార్థులపై కార్యదర్శి అనుచితమైన కుల అహంకార వ్యాఖ్యలు చేయడమేమిటని ప్రశ్నించారు. బోర్డు తుడవడం వేరు.. టాయిలెట్స్ కడగడం వేరు అని గుర్తుచేశారు. ఆమె వ్యాఖ్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

## పాలమూరు దవాఖానకు పంపిస్తే.. ప్రైవేట్‌కు రెఫర్!

- ఇన్‌చార్జి మంత్రి రాజనర్సింహకు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- పట్టించుకోకుండానే సమీక్ష ముగించిన మంత్రి

మహబూబ్‌నగర్, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ప్రభుత్వ దవాఖానల పనితీరు బాగాలేదని.. సాక్షాత్తు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఉమ్మడి పాలమూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ఎదుట అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది. పేదలు దవాఖానకు వస్తే వెంటనే హైదరాబాద్‌కు తీసుకుపోండని పంపిస్తున్నారని.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి దామోదర రాజనర్సింహ, మరో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. వైద్య, ఆరోగ్యశాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తమ ప్రాంతానికి చెందిన రోగులు వస్తే పట్టించుకోకుండా రాజధానికి రెఫర్ చేస్తున్నారని వివరించారు. ప్రైవేట్ అంబులెన్స్ మాట్లాడి పంపుతుండటంతో వాహన డ్రైవర్లు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లకుండా నేరుగా అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లి అడ్మిట్ చేసి చేతులు దులుపుకొంటున్నారని ఫిర్యాదు చేశారు. మరో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ నారాయణపేటలో జిల్లా దవాఖాన ఉన్నా అక్కడకు వచ్చే రోగులను మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేస్తున్నారని తెలిపారు. ఇద్దరు ఎమ్మెల్యేలు మాట్లాడుతుండగా మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఇది నిజమేనని.. ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాల్సిన పేషంట్లను కమీషన్లకు కక్కుర్తిపడి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తున్నారని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ పనితీరుపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే మంత్రి దృష్టికి తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని కానీ.. ఇలా చేయొద్దని కానీ.. అధికారులకు ఆదేశాలు జారీ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని శెట్టికుంట పరిధిలో జేసీబీతో భవనాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

## అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

- శెట్టికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు
- 10 భవనాలను నేలమట్టం చేసిన అధికారులు

అమీన్‌పూర్, మే 30 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 947 శెట్టికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు జేసీబీలతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్ మీడియాతో మాట్లాడుతూ..శెట్టికుంట బఫర్, ఎఫ్‌టీఎల్ స్థలాల్లో 10 వరకు కట్టడాలను గుర్తించి పనులను ఆపాలని సంబంధిత వ్యక్తులకు సమాచారమిచ్చినా వారు స్పందించక పోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు భద్రతతో సదరు నిర్మాణాలను నేలమట్టం చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మున్ముందు ప్రభుత్వ సర్వే నంబర్లు 1000, 1112, 994, 630, 993, 947, 32 పరిధిలోనూ అక్రమ కట్టడాలను గుర్తించి ఉన్నతాధికారుల అనుమతితో కూల్చివేతలకు పూనుకుంటామని స్పష్టం చేశారు.

## నిజాయతీని చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

- మూడు ఘటనల్లో రూ.19లక్షల విలువ చేసే వస్తువుల అందజేత
- సిబ్బందిని అభినందించిన ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సమయాల్లో పోగొట్టుకుంటున్న విలువైన వస్తువులను బాధితులకు అప్పగిస్తూ.. ఆర్టీసీ సిబ్బంది తమ నిజాయతీని చాటుకున్నారు. ఈనెల 25న సూర్యాపేట-హైదరాబాద్ మార్గంలో వెళ్తున్న బస్సులో ఓ ప్రయాణికురాలు రూ.6 లక్షల విలువైన వస్తువులున్న బ్యాగును మర్చిపోగా, కండక్టర్ అంజయ్య, డ్రైవర్ పాషా గుర్తించారు. అధికారుల సమక్షంలో బాధితులకు అందజేశారు. 15న ఆర్టీసీ బస్సు ఎయిర్‌పోర్టు నుంచి లింగంపల్లికి వస్తుండగా, ఓ ప్రయాణికురాలు రూ.8లక్షలు విలువైన వస్తువులున్న బ్యాగును మర్చిపోయారు. డ్రైవర్ ముబీన్ గుర్తించి, అధికారుల సమక్షంలో ఆమెకు అప్పగించారు. ఈనెల 25న ఎయిర్‌పోర్టు బస్సులో శిల్పారామం వద్ద ఓ ప్రయాణికుడు రూ.5లక్షలు విలువైన వస్తువులు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోగా, డ్రైవర్ రమేశ్ గుర్తించి, అధికారుల సమక్షంలో ప్రయాణికుడికి అందజేశారు. వీరందరినీ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీసీవీ ప్రతినిధులు

## గద్దర్ ఫిలిం అవార్డులను రద్దు చేయండి

- పురస్కారాలలో తెలంగాణకు తీవ్ర అన్యాయం: టీసీవీ

రవీంద్రభారతి, మే 30: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిలిం అవార్డుల ఎంపిక ఆంధ్ర పెద్దల కనుసన్నల్లో జరిగిందని, 2014 నుంచి చేసిన అవార్డుల ఎంపిక సరైందికాదని తెలంగాణ సినిమా వేదిక(టీసీవీ) విమర్శించింది. గద్దర్ ఫిలిం అవార్డులను వెంటనే రద్దు చేసి, తెలంగాణ సినిమాలకే అవార్డులు ఇవ్వాలని వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీసీవీ కన్వీనర్ లారా, కోకన్వీనర్ మోహన్ బైరాగి, గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రామ్‌రెడ్డి, సినీదర్శకుడు ఎండీ రఫీ, సీనియర్ జర్నలిస్ట్ సైకిబాబా, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకుడు దిడ్డి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. అవార్డులలో జరిగిన అన్యాయంపై తెలంగాణ కళాకారులంతా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

## నక్సల్స్‌ను చంపితే సిద్ధాంతం చావదు

- మావోయిస్టులకు, ఉగ్రవాదులకు తేడా తెలియని కేంద్ర ప్రభుత్వం
- రేవంత్‌ను అధిష్ఠానం పదేపదే ఢిల్లీకి పిలిపించుకోవడం సరికాదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శలు



న్యూఢిల్లీ, మే 30 (నమస్తే తెలంగాణ): మావోయిస్టులను చంపినంత మాత్రాన వారి సిద్ధాంతం చావదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ అన్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించకుండా ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించడం తప్పు అని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో నారాయణ మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టు సిద్ధాంతం సామాజిక అసమానతలు, ఆర్థిక వివక్ష, అణచివేత నుంచి ఉద్భవించిందని చెప్పారు. ఆ సమస్యలు పరిష్కారం కాకపోతే, ఆ సిద్ధాంతం జనంలో జీవించి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం మావోయిస్టుల ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడకుండా, సామాజిక, ఆర్థిక కారణాలను అర్థంచేసుకొని పరిష్కరించాలని సూచించారు. నక్సల్స్‌ఫ్రీ ఇండియా అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జబ్బలు చర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మావోయిస్టులు, ఉగ్రవాదులకు మధ్య కేంద్రప్రభుత్వానికి తేడా తెలియదని విమర్శించారు. నక్సలైట్లు సమాజం కోసం పోరాడుతారని చెప్పారు. అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం అక్కడ నివసిస్తున్న గిరిజనులను ఖాళీ చేయించాలని కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. నక్సలైట్లు ఉంటే అది సాధ్యంకాదనే కారణంతోనే వారిని చంపుతున్నారని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం పదేపదే ఢిల్లీకి పిలిపించుకోవడం సరికాదని, సీఎంకు కాంగ్రెస్ అధిష్ఠానం స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. ప్రతిసారి పగ్గాలు పట్టి వెనుకకు లాగడం రాష్ట్రానికి, పార్టీకి ప్రయోజనకరం కాదని నారాయణ అభిప్రాయం వ్యక్తంచేశారు.

## 17 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 30 : కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టు పార్టీలో పనిచేయలేక 17 మంది సభ్యులు లొంగిపోయినట్టు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. కొత్తగూడెంలో సీఆర్‌పీఎఫ్ 141వ, 81వ బెటాలియన్ల అధికారులతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 17 మందిలో ఇద్దరు ఏసీఎంలు, నలుగురు పార్టీ సభ్యులు, 11 మంది మిలీషియా సభ్యులు ఉన్నట్టు ఆయన వివరించారు. లొంగిపోయిన వారంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన వారని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 282 మంది మావోయిస్టు పార్టీకి చెందిన వారు లొంగిపోయినట్టు చెప్పారు. లొంగిపోయిన 17 మందికి ప్రోత్సాహక నగదు చెక్కులను ఎస్పీ అందజేశారు.

# మహిళాశక్తి చీరలు ఇచ్చేనా?

### కూలిరేటు నిర్ణయంలో ప్రభుత్వ జాప్యం.. ఆగస్టు 15 నాటికి పంపిణీ అనుమానమే!

హైదరాబాద్ మే 30 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన మహిళాశక్తి చీరెల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. నూలు సిద్ధమైనా కూలి రేటు ఖరారు కాకపోవడంతో ఉత్పత్తి ఆలస్యమవుతున్నదని తెలుస్తున్నది. బతుకమ్మ చీరెల మాదిరిగానే మీటరుకు రూ.34 చొప్పున చెల్లిస్తామని సర్కారు మెలిక పెడుతుండడంతో కార్మికులు తయారీకి ముందుకురావడంలేదు. వెరసీ మహిళా సంఘాల్లోని సభ్యులకు ఆగస్టు 15 నాటికి చీరల పంపిణీ సాధ్యం కాకపోవచ్చని అధికార వర్గాలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాయి.

### ప్రకటన ఆర్భాటం.. పనులు ఆలస్యం

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 65 లక్షల మంది మహిళలకు ఒక్కొక్కరికి రెండు చొప్పున చీరలు పంపిణీ చేస్తామని, 2024 ఆగస్టు 8న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా



సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బతుకమ్మ పండుగ నాటికి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. బతుకమ్మ పండుగకు పంపిణీ చేయకపోగా, సంక్రాంతికి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం వరుసగా వాయిదాలు వేస్తూ పోతున్నా.. చేనేత జౌళిశాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. 2025 జనవరిలో ఒక విడత, మార్చిలో రెండో విడత చీరల కోసం వస్త్రం ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు. అయితే సిరిసిల్లలో 26 వేల మరమగ్గాలు ఉండగా కేవలం 2 వేల సాంచాలపైనే వస్త్రోత్పత్తి చేయాలని నిర్ణయించారు.

### కూలి రేటుపై మీనమేషాలు

రెండు విడుతల్లో కలిపి చేనేత జౌళిశాఖ 4.24 కోట్ల మహిళా శక్తి చీరలకు ఆర్డర్లు ఇచ్చింది. ఆసాములు, కార్మికులకు ఇచ్చే కూలీ రేటు నిర్ణయించలేదు. గతంలో బతుకమ్మ చీరలకు మీటరకు రూ.34 చొప్పున చెల్లించేవారు. ఇందులో ఆసాములకు రూ. 11, కార్మికులకు రూ. 5 చొప్పున చెల్లించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం చెప్తున్నట్టుగా కాటన్ చీర ఉత్పత్తి చేయాలంటే పనిభారం ఎక్కువగా ఉంటుందని, కూలీ పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం మీటరకు రూ.2 చొప్పున అంటే ఆసాములకు రూ. 13, కార్మికులకు రూ. 7 చొప్పున ఇవ్వాలని కోరుతున్నారు. లేకపోతే నెలకు రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితిలేదని వాపోతున్నారు. కార్మికుల విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వస్త్ర ఉత్పత్తి మొదలుకాలేదు.

### బతుకమ్మ పండుగకైనా అందేనా?

ముఖ్యమంత్రి ప్రకటించి 9 నెలలవుతున్నా చీరల తయారీ ప్రారంభంకాలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు 1.50 కోట్ల బతుకమ్మ చీరల ఉత్పత్తికి తొమ్మిది, పది నెలల ముందే ఆర్డర్లు ఇచ్చేది. ఉరుకులు పరుగుల మీద నేస్తేనే బతుకమ్మ పండుగనాటికి చీరలు సిద్ధమయ్యేవి. కానీ ఈ ఏడాది ఆగస్టు 15న నాటికి చీరలు అందజేస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ ఇందుకు ఇంకా రెండున్నర నెలల సమయం మాత్రమే ఉన్నది. ఈ పరిస్థితుల్లో చీరలు అందే పరిస్థితి ఉండదని, కనీసం బతుకమ్మ పండుగకు కూడా మహిళా శక్తి చీరలు పంపిణీ చేసే పరిస్థితి కనిపించడంలేదని అధికారులు చెప్తున్నారు.